షావుకారం సుబ్బయ్య

"యాభై ఏళ్ళకిందట మావూళ్ళో కోమటి దుకాణంలేదు" అన్నాడు బావ.

చిట్టి కిల కిలా నవ్వి, "కోమటికొట్టు లేకపోతే పిప్పరమెంటులూ, బిస్కట్లూ ఎవరమ్మేవాళ్ళు?" అన్నది.

"పిప్పరమింటులూ, బిస్కట్లూ ఎక్కడివీ ? అవీ ఉండేవి కావు" అన్నాడు బావ.

"కోమటికొట్టు లేకపోతే ఉప్పూ, పప్పూ, చింతపండు ఎక్కణ్ణించి వచ్చేవీ?" అన్నాడు బుల్లాడు.

"బళ్ళమీద రాసులు పోసుకుని తెచ్చేవాళ్ళు, ఏడాదికి సరిపడా అందరూ కొనుక్కునేవాళ్ళు" అన్నాడు బావ.

"అంత పెద్ద ఊరు గదా. మీ ఊళ్ళో అన్ని కాఫీ హోటళ్ళున్నయే ఒక్క కోమటి దుకాణం లేదా?" అన్నాడు బుల్లాడు నమ్మలేకుండా.

"అప్పటికింకా మా ఊరి మీదుగా రైలు లేదు. ఊరుకూడా చాలా చిన్నది. కాఫీహోటళ్ళు లేనేలేవు. అట్లా వుండగా మా ముత్తాతగారి పెళ్ళిఅయింది" అన్నాడు బావ.

"మీ ముత్తాత పెళ్ళికి పల్లకీ ఎక్కాడా?" అన్నది చిట్టి.

"ఎందు కెక్కడూ? మా ముత్తాత చిన్న జమిందారు. దాదాపు ఊళ్ళో పొలాలన్నీ ఆయనవే" అన్నాడు బావ.

"హిహిహి ? ముసలాళ్ళు పల్లకీ ఎక్కుతారా ?" అన్నది చిట్టి.

"పెళ్ళికి మా ముత్తాత బుల్లాడికంటె కొంచెం పెద్దవాడు" అన్నాడు బావ. చిట్టి నవ్వటం ఆపింది.

"ఆ పెళ్ళికి——" అని బావ ఏదో చెప్పబోతుంటే బుల్లాడు అడ్డంవచ్చి, "ఆ పొలాలన్నీ ఏమైనయి బావా?" అన్నాడు.

"అక్కడే వున్నై. ఇంకా పెరిగినై కూడాను" అన్నాడు బావ.

" అవన్నీ యిప్పుడు నీవేనా?" అన్నాడు బుల్లాడు.

"కావు, మా ముత్తాతకు ముప్ఫయిమంది మునిమనమలం" అన్నాడు బావ.

"ఆ పొలం అంతా పంచుకున్నారా?" అన్నాడు బుల్లాడు.

"అందులోనూ ఒక్కొక్కనికీ నూరోవంతుకూడా రాలేదు. చెబుతా వినండి. మా ముత్తాత గుడికట్టించి, గుడికింద కొంతపొలం ఇచ్చేశాడు. ఊళ్ళో ఒక మంగలి

వాణ్ని, ఒక చాకలివాణ్ని, ఒక కుమ్మరిని, ఒక కమసాలివాణ్ని పెట్టి వాళ్ళందరికీ తలా రెండెకరాలూ యిచ్చేశాడు. బీదబ్రాహ్మలందర్నీచేర్చి వాళ్ళకి భూదానంచేశాడు'' అన్నాడు బావ.

"మీ ముత్తాత చాల మంచివాడే'' అన్నది చిట్టి.

"ఆయన ఊళ్ళో ఒక బోగందాన్నికూడా తెచ్చిపెట్టి దానికి యాభై ఎకరాలు రాసిచ్చాడు. ఒక రెండంతస్తుల మేడకూడా కట్టించి పెట్టాడు'' అన్నాడు బావ.

"ఎబ్బే! మీ ముత్తాత చెడ్డవాడు'' అన్నది చిట్టి ఆముదం తాగిన మొహం పెట్టి.

"వినండి!'' అన్నాడు బావ. "మా ముత్తాత పెళ్ళికి సరుకులందించటానికిగాను ఒక కోమటిని నియమించారు. ఆ కోమటి దక్షిణాదివాడు. మా ముత్తాత పెళ్ళి చాలా వైభవంగా జరిగింది.''

"ఎన్నివేలు ఖర్చుపెట్టారు?'' అన్నది చిట్టి.

"ఒక వెయ్యిరూపాయలు ఖర్చయిఉంటై''అన్నాడు బావ.

"అంతేనా! నీ పెళ్ళికే నాన్న వెయ్యిరూపాయలు ఖర్చుచేశాడు గదా!'' అన్నది చిట్టి.

"అప్పటి రోజుల్లో వెయ్యి రూపాయలంటె చాలా ఎక్కువ. పట్నంనుంచి నూరురూపాయల మందుగుండు సామాను తెచ్చారు. సదస్యం నాడు అయిదువందల రూపాయలు సంభావన ఇచ్చారు. గృహప్రవేశం నాడు వెయ్యి మంది భోజనాలు చేశారు. ఇదీ పెళ్ళికొడుకు వారివేపు ఖర్చు. రెండు వేపుల వాళ్ళకి కావలసిన బట్టలూ, నగలూ, సరుకులూ సమస్తమూ కోమటాయనే కొన్నాడు. ఈ పెళ్ళిలో కోమటి బోలెడంత డబ్బూ, వస్తుసామగ్రీ, బట్టలూ, బంగారమూ కూడా వెనకేశాడు. ఇది పెట్టి ఆయన మా ఊళ్లో చిన్న చిల్లర దుకాణం పెట్టాడు. మొదట్లో ఈ చిల్లర దుకాణం ఊళ్లోవుండే అలగాజనానికి ఉపయోగపడింది. వాళ్ళుకొనే దమ్మిడీ చింతపండులోనూ, దమ్మిడీ మిరపకాయల్లోనూ, దమ్మిడీ వుప్పులోనూ కోమటికి సగానికి సగం లాభం.

"కోమటికి పెద్ద గిరాకీ ఏమి అంటే మా ముత్తాత వుంచుకున్న బోగంది. ఆవిడ రకరకాల చీరెలూ, నగలూ, అగరువత్తులూ, అత్తరు కోమటిద్వారా తెప్పించుకునేది. వీటిల్లో కోమటి మంచి లాభం చేసేవాడు. ఇదిగాక కోమటి చిన్న చిన్న రైతులకూ వాళ్ళకీ కొట్లో కాతాలు పెట్టేవాడు. తప్పుడు లెక్కలు రాసేవాడు. పంట రాగానే ధాన్యం కొలుచుకునేవాడు. డబ్బు తీసుకోనకుండా ధాన్యం కొలుచుకోనడంలో కోమటికి మరింత లాభం ఉండేది. ఆ రోజుల్లో కోమటిని ముష్టివాణ్ని చూసినట్టు చూసేవాళ్ళు. ఎందుకంటే అందరిదగ్గర వినయ విధేయతలుగా ఉండి చెయ్యిచాచి అడిగి, న్యాయంగా రావలసిన దానికన్నా ఎక్కువ పుచ్చుకునేవాడు.

"మా తాతగారి కాలంనాటికి కోమటి ముసలాడైనాడు. నాలుగైదు వేలు పోగు చేశాడని చెప్పుకునేవాళ్ళు. కాని ఆ ఎర్రపంచె తప్ప కట్టేవాడు కాడు. ఆయనకిద్దరు కొడుకులు. పెద్దవాడు బళ్ళసరుకుల వ్యాపారం ప్రారంభించాడు. బెల్లమూ, చింతపండూ, కందా, పెండలమూ, ఉల్లిపాయలూ-ఇటువంటివి తానేతెచ్చి ఊళ్ళో అమ్మినంత అమ్మి మిగిలినవి దుకాణంలో పెట్టించి తమ్ముడిచేత అమ్మించేవాడు. ఊళ్ళో ధాన్యంకొని బస్తీకి పట్టుకెళ్ళి మర పట్టించి అక్కడే అమ్మేసేవాడు. చిన్నవాడు సన్న సన్నగా వడ్డీవ్యాపారాలు ప్రారంభించాడు. రోడ్లుకాస్త మంచివి పడేటప్పటికి మావూరు పెరగటం మొదలుపెట్టింది ఊళ్ళో కాస్త కలవాళ్ళు ఒళ్ళుతెలియని ఖర్చులుచేసి, ఆ తరాని కాతరము ఆస్తి పంపకాలమీద తరిగిపోతూ ఉన్నకొద్దీ దాయాదుల తగాదాలు పెంచుకుని కోర్టులకెక్కి ఉన్నదికూడా తగలేసుకోవటం మొదలుపెట్టారు. కుటుంబాలు పెరుగుతున్నకొద్దీ వ్యవసాయంమీద బతకటం కష్టసాధ్యమై చదువులకూ, ఉద్యోగాలకూ ఎగబడవలసి వచ్చింది. ఊళ్ళో రైతులు పెరిగారు. మధ్య తరగతిలో ముందాలోచన లేని మూఢులు తమ తదనంతరం పిల్లలేమవుతారో అనే ఆలోచనైనా లేకుండా రెండు చేతులా అప్పుచేసి జూదాలాడి. ముండలకు పెట్టి ఒళ్ళూపై తెలీకుండా ఖర్చుచేసేశారు. ఇదంతా కోమటికి చాలా లాభించింది. కోమటి బిడ్డలు పెద్ద వ్యాపారస్తులే కాక వడ్డీ వ్యాపారస్తులుకూడా అయినారు. బీద రైతులందరూ వాళ్ళ బాకీదార్లే. ఊళ్ళో పెద్ద కుటుంబాలన్నీ వాళ్ళకి ఋణపడ్డవే.

"మా తాత తనకు వచ్చిన ఆస్తిలో అయిదోవంతుకూడా పిల్లలకు దక్కనివ్వలేదు. మీరు చెబితే నమ్మరు. మా తాతకు దస్కతు చెయ్యటంరాదు. తన పిల్లలకింత చదువన్నా చెప్పించలేదు. మానాన్న మెట్రిక్యులేషను దాకా చదివి తాలూకా ఆఫీసు గుమాస్తాగా చేరాడు. అందరూ తలో దారీ అయినారు.

"మా వూరి కోమట్లుకూడా తలోదారీ అయినారు. ఒకడు పట్నంలో నగల వ్యాపారం చేస్తున్నాడు. మరొకడు గుంటూరులో పొగాకు వర్తకుడు. ఇంకోడు బెజవాడలో బియ్యం మరలు కంట్రాక్టుతీసుకొని కనపడని లాభాలు తీస్తున్నాడు. మావూరికి మాత్రం సుబ్బయ్య మిగిలాడు. సుబ్బయ్య తండ్రి పాతిక వేలుపెట్టి మా వూళ్ళో బ్రహ్మాండమైన మేడకట్టించాడు. దాన్ని అద్దాలమేడ అంటారు. సుబ్బయ్య తండ్రి మొన్న మొన్నటిదాకా చెప్పతరంగాని వడ్డీ వ్యాపారము చేశాడు. అన్నీ మార్వాడీ వడ్డీలు. బీదవాళ్ళకిచ్చే తక్కువ మొత్తాలమీద ఎక్కువవడ్డీలు. ఎందరి కొంపలు తీశాడో తెలీదు. ఊళ్ళో పది పన్నెండిళ్ళు కొన్నాడు. అయిదారు సొంతాన కట్టించాడు. మా వూరికి మునిసిపాలిటీ వచ్చిన తరువాత సుబ్బయ్య తండ్రి లేకుండా పురపాలక సంఘం లేదు. అట్లాకూడా డబ్బు దోచాడు.

"సుబ్బయ్యా, సుబ్బయ్య మేనత్త కొడుకు బంగారయ్యా, మా బాబాయీ కలిసి చదువుకున్నారు. 1921లో గాంధీఉద్యమం వచ్చినప్పుడు మా బాబాయీ బంగారయ్యా

కలిసి చదువులుమానేసి ఖద్దరువేసుకున్నారు. సుబ్బయ్య మట్టుకు అందులో చేరలేదు. బంగారయ్య మాటేమోగాని మా బాబాయి తనకున్న కాస్త ఆస్తీ తగలేసుకున్నాడు. సుబ్బయ్య తండ్రిచేసిన వడ్డీ వ్యాపారం అందుకున్నాడు. 1930 లో మాబాబాయి సుబ్బయ్యను అడిగాడు, ఈ సారన్నా ఉద్యమంలోకి వస్తావా అని. సుబ్బయ్య, 'మాకు ఉద్యమాలెందుకు బాబూ! పెద్దలు మీరంతా వున్నారుగా. ఉద్యమం నడపండి, మీవెనక మేమూ ఉన్నాంలే' అన్నాడు.

"కిందటిసారి కాంగ్రెసు ప్రభుత్వం వస్తూనే వడ్డీ వ్యాపారస్తుల నడుము విరగ్గొట్టింది. డబ్బు కొటకంమూలంగా సుబ్బయ్య ఎన్నోలక్షల విలువైన ఆస్తులు అంటగట్టుకుని లాభాని కమ్ముకున్నాడు. కాని ఇప్పుడు కాంగ్రెస్ తన పొట్టమీద కొట్టిందని కాంగ్రెసును దుమ్మెత్తిపోశాడు. మా బాబాయికీ సుబ్బయ్యకూ ఓ నాడు పెద్ద యుద్ధమైంది కూడాను.

"కాంగ్రెసు పదవిలోకి వచ్చేవరకు సుబ్బయ్య అటు ప్రభుత్వోద్యోగులను ఒక కంట కనిపెట్టేవున్నాడు. కాంగ్రెసు పరిపాలన ప్రారంభంకాగానే గాంధీటోపీ ఒకటి సంపాదించి కొన్ని ఖద్దరు గుడ్డలుకూడా చేర్చాడు. ఇంటిమీద కాంగ్రెసు జెండాకూడా ఎత్తాడు.

"యుద్ధం వచ్చింది. ఇకనేం సుబ్బయ్య పంటపండింది. ఖద్దరుటోపీ అవతల పారేశాడు. మంచిమంచి సూట్లు కుట్టించాడు. మెడ్రాసుచుట్టూ తిరిగాడు. ఆ అధికార్లనుచూచాడు, ఈ అధికార్లను కట్టుకొని ఏవేవో కంట్రాక్టులు సంపాదించాడు. దొంగ వ్యాపారస్తులతో చేరి లక్షలు సంపాదించాడు. ఒక కేసులో పట్టుబడి వెయ్యి రూపాయలు జరిమానాకూడా ఇచ్చుకున్నాడు.

"యుద్ధం జరిగిన కాలములో సుబ్బయ్య మా బాబాయికి చాలా సహాయము చేశాడు. కాని, మా బాబాయికి సుబ్బయ్యచేసే పనులు రుచించేవికావు. బంగారయ్యతో కూడా మా బాబాయికి చెడిపోయింది. బంగారయ్య పోయి కమ్యూనిస్టుల్లో చేరాడు. అయినా మా బాబాయికి సుబ్బయ్యను చూస్తేకన్న బంగారయ్యను చూస్తేనే ఎక్కువ కోపంగా ఉండేది.

"ఇది ఇట్లా వుండగా ఇంకో చిత్రం జరిగింది. మా వూళ్ళో వెంకయ్య అనే ఒక పెద్ద మోతుబరి వున్నాడు. డెబ్బైఎకరాల ఆసామీ. ఆయన కొడుకు వెళ్ళి కమ్యూనిస్టుల్లో చేరాడు. సుబ్బయ్య కొడుకూ, వెంకయ్య కొడుకూ చిన్నప్పటినుంచి స్నేహితులు. వెంకయ్యకొడుకు సుబ్బయ్యకొడుకును కాస్తా కమ్యూనిస్టుల్లో చేర్చాడు. ఈ సంగతి తెలియగానే సుబ్బయ్య కెక్కడలేని దుఃఖమూ వచ్చింది. ఒక్కడే కొడుకు. తను సంపాదించిన లక్షలన్నీ ఏంగాను? కొడుక్కు నయానాభయానా చెప్పిచూచాడు. లాభంలేకపోయింది. సుబ్బయ్య బంగారయ్యను తిట్టాడు. పనిపెట్టుకుని వెంకయ్యను కూడా తిట్టాడు. వెంకయ్య సుబ్బయ్యను ఓదార్చి 'నా కొడుకూ చెడిపోయినవాడే నన్నేం చెయ్యమంటావు. ఈ కాలపు వెధవల కిట్లా పుట్టుకొస్తున్నది' అన్నాడు.

"సుబ్బయ్య దొంగవ్యాపారం చేస్తున్నమాట ఊళ్ళోఅందరికీతెలుసు. 'కమ్యూనిస్టులు సుబ్బయ్య దొంగతనం పట్టుకోకపోవడం సుబ్బయ్య కొడుకు కమ్యూనిస్టు పార్టీలో వుండటంవల్లనే' అన్నారు.

"ఇంతలో ఒక రోజు ఒక చిత్రం జరిగింది. వెంకయ్య కొడుకు ఊళ్ళో బుర్రకథా, కూచిపూడి భాగవతమూ పెట్టించాడు రైతులకోసం. అదిచూడటానికి వెంకయ్యా, వాళ్ళ బలగం యావత్తు వెళ్ళారు. వెంకయ్యకీ కొడుక్కూ పడదు గనుక వెంకయ్య వెళ్ళడనుకున్నారు. కాని వెంకయ్య వెళ్ళాడు. అందర్నీ పిలుచుకుని కూడా వెళ్ళాడు. కొడుక్కూ తనకూ తేడాలుంటే అవి తమ ఇద్దరిమధ్యనే. ఊళ్లోవాళ్ళకి సంబంధంలేదు. ఊళ్లో తన కొడుకు చేయించేదీ, తను చేయించేదీ. వెంకయ్య పెత్తనం మీదేసుకుని పందిరి కట్టించాడు. వచ్చినవారికి కూచునే సదుపాయాలుకూడ మధ్యాన్నం నుంచి చేయించాడు.

"ఈ సంగతి తెలిసి సుబ్బయ్య అనుకున్నాడు గదా, నేనూ నా కొడుకుతో పైకి సఖ్యంగానే ఉంటాను. వెంకయ్యకు కొడుకుతో లేని పేచీ, నా కొడుకుతో నా కెందుకు? వాడడిగితే డబ్బుకూడా యిస్తాను. వాడి పెళ్ళి వైభవంగా చేస్తాను అనుకున్నాడు.

"ఆ రాత్రే అటు బుర్రకథ జరుగుతున్న సమయములో ఇటు కమ్యూనిస్టు కుర్రవాళ్ళు సుబ్బయ్య దొంగతనం పట్టుకున్నారు. పట్టుకున్నవారిలో సుబ్బయ్య కొడుకుకూడా ఉన్నాడు. సుబ్బయ్య కొందరు రౌడీలను దొంగ మార్కెటు సరుకు వెంట కాపలా ఉంచాడు. ఒక రౌడీ సుబ్బయ్య కొడుకు నెత్తిమీద కర్రపెట్టి బలంగా కొట్టాడు. ఇంతలో మిగిలిన వాళ్ళువచ్చి రౌడీని పట్టుకుని పోలీసులకు వప్పగించారు. పోలీసులు రౌడీలను వదలివేశారు. సుబ్బయ్యమీద కమ్యూనిస్టులు పెట్టిన కేసు ఏమయిందో తెలీదు.

"సుబ్బయ్య కొడుకు ఇరవై రోజులు మంచంలోవుండి తెప్పరిల్లాడు. కొడుకు చస్తాడనే భయంతో సుబ్బయ్యకు మతిపోయింది. ఆఖరుకు కొడుకును చూడటానికి వెళ్ళాడు. కొడుకు సుబ్బయ్యకేసి చూడలేదు. 'నువ్వెవరవో నేనెరుగను వెళ్ళిపో' అన్నాడు. సుబ్బయ్య ఏడుస్తూ ఇంటికొచ్చాడు" అని కథ పూర్తి చేశాడు బావ.

"అంతేకావాలి సుబ్బయ్యకు, అంతే కావాలి!" అన్నది చిట్టి కసిగా.

"ఏవో కబుర్లలో వున్నారే! అన్నానికి లేవ్వోయ్!" అన్నాడు నాన్న!

ముద్రణ :
ప్రచురణ : పట్నవాసం కథల సంపుటిలో
దేశి కవితా మండలి, విజయవాడ.
ఏప్రిల్, 1952